క్లుప్తంగా

రేపు గోదాదేవి కల్యాణం

రంగంపేట: వడిశలేరులోని శ్రీదేవి భూదేవి సమేత భజేనారాయణస్వామి దేవాలయంలో శనివారం భోగి పర్వదినం రోజు రాత్రి 8.30 గంటలకు గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.రాంబాబురెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 15వ తేదీ ఆదివారం మధ్యాహ్నం గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు విచ్చేసి గోదాదేవి కల్యాణం తిలకించాలని కోరారు. కార్యక్రమంలో వల్లూరి సూర్యభాస్కరరావు, గుమస్తా హనుమంతు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు జెడ్పీటీసీల అభినందనలు



ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యులు

అనపర్తి: అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డిని గురువారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల జెడ్పీటీసీలు కలిసి అభినందనలు తెలియజేశారు. కృష్ణారెడ్డి నియామకానికి కృషిచేసిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం కృష్ణారెడ్డికి జ్ఞాపికను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో అనపర్తి, పెదపూడి, బిక్కవోలు, రంగంపేట జెడ్పీటీసీలు సత్తి గీతా వరలక్ష్మి, రొంగల పద్మావతి, పేపకాయల వెంకటలక్ష్మి, పొలమూరు ఉపసర్పంచి సత్తి సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసి పూజ



స్వామికి లక్ష తులసి పూజ నిర్వహిస్తున్న పండితులు

అనపర్తి: గ్రామంలోని పాతవూరిలో గత సత్తి పోతారెడ్డి, తేతలి రామిరెడ్డి రామాలయంలో సీతారామచంద్రస్వామికి లక్ష తులసి పూజ గురువారం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసంలో నిర్వహించే పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆలయ అర్చకులు పెద్దింటి కృష్ణమాచార్యులు, వేదాంతం భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేదపండితులు వాడపల్లి వేణుగోపాలాచార్యులుతో పాటు ఋత్విక్‌లు పూజా కార్యక్రమాలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాల పంపిణీ



కార్మికులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న సర్పంచ్ కర్రి బుల్లిమోహన్‌రెడ్డి తదితరులు

అనపర్తి: సంక్రాంతి సందర్భంగా మండలంలోని కొప్పవరం పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ కర్రి బుల్లిమోహన్‌రెడ్డి, లక్ష్మిఅరుణకుమారి దంపతులు సమకూర్చిన నూతన వస్త్రాలు, దుప్పట్లు, నిత్యావసరాలను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు తాడి వెంకటరామకృష్ణారెడ్డి, తాడి సూరారెడ్డి, ఉపసర్పంచ్ మల్లిడి వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీ పోతంశెట్టి మంజు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా పడాల శ్రీనివాసరెడ్డి



పడాల శ్రీనివాసరెడ్డి

అనపర్తి: అనపర్తి మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా మండలంలోని కుతుకులూరుకు చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పడాల శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. దీనికి సంబంధించి అనపర్తి ఏడీఏ డీవీ కృష్ణ నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు సలహా మండలి చైర్మన్‌గా పనిచేసిన నల్లమిల్లి సుబ్బారెడ్డి కుతుకులూరు పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా నియమించడంతో ఆయన ఈ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రతిపాదన మేరకు వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు.

భగవద్గీత శ్లోకాల పోటీ

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో గురువారం భగవద్గీత శ్లోకాల పోటీ జరిగింది. విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభను కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీకి చెందిన విజయలక్ష్మి, గీత పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



గండ్రేడులో డివిడెండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసి కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆయన గండ్రేడు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో డివిడెండ్ల పంపిణీ, రచ్చబండ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గండ్రేడు సొసైటీలో సుమారు 1543 మంది రైతులకు వారి షేర్ ధనంపై రూ.17.20 లక్షల్ని డివిడెండ్ల రూపేణా పంపిణీ చేశామన్నారు. సొసైటీ సీజీఎఫ్ నిధులు రూ.1.50 లక్షలతో రచ్చబండను నిర్మించామని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన ఎరువులు రాయితీపై అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ యార్లగడ్డ అమ్మన్న చౌదరి, ఎంపీపీ కేతా తులసి, సర్పంచ్ కుడిపూడి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు జి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. జి.మామిడాడలో సబ్బెళ్ల కాంతమ్మ, తాతారెడ్డి గ్రంథాలయం వార్షిక క్యాలెండర్‌ను వ్యవస్థాపకులు సబ్బెళ్ల సుబ్బలక్ష్మి, సూరారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆవిష్కరించారు.

గ్రాసిం ఇండస్ట్రీస్ సేవలు అభినందనీయం

రంగంపేట: సింగంపల్లిలో గ్రాసిం సంస్థ ఆర్థిక సహకారంతో నిర్మించనున్న కల్చరల్ యాక్టివిటీస్ భవనం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలోని వీరంపాలెం, జి.దొంతమూరు, నల్లమిల్లి, సింగంపల్లి తదితర గ్రామాల్లో తాగునీటి పథకాలు, కమ్యూనిటీ భవన నిర్మాణాలకు గ్రాసిం సంస్థ యాజమాన్యం ఏర్పాటు చేయడం విశేషమన్నారు. కార్యక్రమంలో గ్రాసిం సంస్థ యూనిట్ హెడ్ కృష్ణన్, హెచ్‌ఆర్ మురళీకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని కాపవరం, ఆర్ఎస్‌పేటల్లో కల్చరల్ యాక్టివిటీస్ భవనాలు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. గ్రాసిం ఇండస్ట్రీస్ వారి సౌజన్యంతో కాపవరంలో రూ.45 లక్షలు, ఆర్ఎస్‌పేటలో రూ.45 లక్షలతో ఈ భవనాలు నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ సంఘ చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, మాజీ ఏఎంసీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, కాపవరం సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

అనపర్తి: అనపర్తి సావారంలో గ్రాసిం ఇండస్ట్రీస్ సౌజన్యంతో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో నాలుగు గ్రామాల్లో నిర్మించే కల్చరల్ యాక్టివిటీస్ భవన నిర్మాణాలకు గాను బిక్కవోలు మండలం బలభద్రపురంలో గల గ్రాసిం ఇండస్ట్రీస్ సీఎస్ఆర్ నిధులు రూ.1.60 కోట్లు ఖర్చుచేస్తున్నట్లు తెలిపారు. అనపర్తి అభివృద్ధికి తమ వంతు సహకరిస్తున్న గ్రాసిం ఇండస్ట్రీస్‌కు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, గ్రాసిం సంస్థ యూనిట్ హెడ్ కృష్ణన్, హెచ్‌ఆర్ మురళీకృష్ణ, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన్‌బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు అభినందనీయం



మాట్లాడుతున్న మంత్రి అమర్నాథ్, చిత్రంలో జక్కంపూడి రాజా, ఆకుల వీర్రాజు, తోట త్రిమూర్తులు, జక్కంపూడి గణేష్

- మంత్రి గుడివాడ అమర్నాథ్
- విజేతలకు బహుమతుల ప్రదానం

రాజానగరం: గ్రామీణ క్రీడాకారులను గుర్తించి, ప్రోత్సహించాలనే ఉద్దేశంతో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. ఖేలో రాజానగరం పేరిట నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలలో నిర్వహించిన స్పోర్ట్స్ ఫెస్టివల్స్ గురువారం విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా రాజానగరం మండలం పాలచర్లలో గురువారం రాత్రి నిర్వహించిన ముగింపు సభలో మంత్రి పాల్గొని, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా పేరు చెప్పగానే జక్కంపూడి రామ్మోహనరావు గుర్తుకు వస్తారు, ఎందుకంటే ఆయనకు జిల్లా ప్రజలతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. అటువంటి కుటుంబం నుంచి వచ్చిన రాజా, గణేష్ నిరంతరం ప్రజల యోగక్షేమాల కోసమే పాటుపడుతూ తండ్రి అడుగుజాడల్లో పయనిస్తుండటం హర్షణీయమన్నారు. రాజానగరం మండలం కలవచర్లలో త్వరలో వంద ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎంపీపీలు మండారపు సీతారత్నం, గుర్రం జ్యోత్స్న, జెడ్పీటీసీ సభ్యులు వాసంశెట్టి పెద వెంకన్న, కర్రి నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్లు దూలం పెద్ద, బుజ్జిబాబు, నాయకులు జక్కంపూడి గణేష్, గంగిశెట్టి సోమేశ్వరరావు, కోలపాటి వెంకన్న, గండి నానిబాబు, సాయిరామ్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఎటు చూసినా సంక్రాంతి సందడే

బిక్కవోలు: పిండి వంటలు, బొమ్మల కొలువులు, గొబ్బెమ్మలు, రంగురంగుల రంగవల్లులు, ఎర్రగా పండిన గోరింటాకు చేతులు, భోగిమంటలు, ఎడ్ల పందేలు, హరిదాసుల కీర్తనలు, డూడూ బసవన్నల సందడులు, కొత్త అల్లుళ్లకు మర్యాదలు.. ఒక్కటేమిటి సంక్రాంతి పండగంటేనే ఎన్నో మధురానుభూతులు.. అందుకే జీవనగమనంలో ఎక్కడెక్కడో స్థిరపడిన వలసపక్షులు సైతం సంక్రాంతి వస్తుందంటే చాలు సొంతూరికి వచ్చి వాలిపోతారు. ప్రస్తుతం ఊరూరా, వాడవాడలా సంక్రాంతి సందడి నెలకొంది. ప్రతి ఇంటి ముంగిట వేసిన సంక్రాంతి ముగ్గులు ఊళ్లోకి వచ్చేవారందరికీ స్వాగతం పలుకుతున్నాయి. భోగి పండగ రోజున భోగి మంట వెలిగించడానికి పల్లెల్లో ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో పిల్లలు భోగి మంట వేసేందుకు కలప, పిడకలు ఉత్సాహంగా సేకరిస్తున్నారు.



మహేంద్రవాడలో భోగి మంటకు ఏర్పాట్లు

వివేకానందుని స్ఫూర్తిగా తీసుకోవాలి



వివేకానందుని జయంత్యుత్సవంలో పాల్గొన్న సమితి సభ్యులు



వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సర్పంచ్ రమణ



విజేతలైన విద్యార్థులతో సంపర ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు

అనపర్తి: స్వామి వివేకానందుని జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది నల్లమిల్లి శివారెడ్డి అన్నారు. స్వామి వివేకానంద జయంతిని స్థానిక శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వివేకానంద సెంటర్‌లోని వివేకనందుని విగ్రహానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి మాట్లాడుతూ వివేకానందుని స్ఫూర్తిదాయక రచనలు, సాహిత్యం యువతకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు సత్తి వెంకటరెడ్డి, తేతలి సుందరరామారెడ్డి, కార్యదర్శులు తాడి చంద్రశేఖర్‌రెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి సత్తిరెడ్డి, మల్లిడి సురేంద్రరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జీవితంలో వెలుగులు

రంగంపేట: స్వామి వివేకానందుని సూక్తులతో ప్రతిఒక్కరూ తమ జీవితాల్లో వెలుగులు నింపుకోవాలని సర్పంచ్ గోలి రమణ అన్నారు. గురువారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జి.దొంతమూరు సచివాలయంలో వివేకానంద చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పెదపూడి: పాశ్చాత్యులను సైతం భారతీయత వైపు నడిచేలా చేసిన మహోన్నత వ్యక్తి నరేంద్రుడని సంపర ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. సంపర ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానందుని 160వ జయంతి, అసోసియేషన్ 5వ వార్షికోత్సవ కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. వివేకానందుని జీవితంపై మండలవ్యాప్తంగా 600 మంది విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో 12 మంది విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి శృతి(పెద్దాడ), ద్వితీయ బహుమతి రామతులసి(సంపర), తృతీయ బహుమతి ప్రశాంతి(పెద్దాడ) గెలుచుకున్నారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంపర అభివృద్ధి కమిటీ చైర్మన్ అద్దంకి ముక్తేశ్వరరావు, పోస్టల్ ఎంప్లాయిస్ రాష్ట్ర నాయకుడు కొమ్మన శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్‌టీయూ నాయకుడు నాగిరెడ్డి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడు స్ఫూర్తిప్రదాత

రాజానగరం: వివేకానందుడు యువతకు స్ఫూర్తిప్రదాత అని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అన్నారు. జాతీయ యువజనోత్సవాన్ని పురస్కరించుకుని యూనివర్సిటీలోని ఈసీ హాలులో గురువారం వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు డాక్టర్ పి.విజయనిర్మల, సీఈ ఎస్.లింగారెడ్డి, ఏఆర్ జి.చంద్రకళ, ఎఫ్ఓ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆదికవి నన్నయ యూనివర్సిటీలో..

వాగులో పడి విద్యార్థి మృతి

అడ్డతీగల: అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలంలోని పైడిపుట్ట వద్ద గురువారం కన్నేరువాగులో పడి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన చెరుకూరి విద్యాలయం పదో తరగతి విద్యార్థి డోకుబుర్ర సుభాష్(15) మృతి చెందాడు. కోరుకొండలోని చెరుకూరి విద్యాలయం నుంచి కొంతమంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది విహారయాత్ర కోసం గురువారం ఉదయం అడ్డతీగల మండలం పైడిపుట్ట వద్ద కన్నేరువాగు పరిసరాలకు వచ్చారు. స్నానాలు చేసేందుకు విద్యార్థులు వాగులోకి దిగారు. వీరిలో డోకుబుర్ర సుభాష్ నీటిలో మునిగి అపస్మారక స్థితికి చేరాడు. మిగతా విద్యార్థులు, ఉపాధ్యాయులు అతడిని హుటాహుటిన బయటకు తీశారు. విద్యాలయానికి చెందిన బస్సులో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్థానిక పోలీసులు తెలిపారు.

పీడీ కేసు నమోదు

రాజమహేంద్రవరం రూరల్: అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న బుర్రిలంకకు చెందిన నిశ్చనకోళ్ల వీరవేణిపై పీడీ యాక్టు నమోదు చేసినట్టు సౌత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ తెలిపారు. ప్రస్తుతం ఆమె మహిళా జైలులో రిమాండ్‌లో ఉందన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ



బ్రాంజ్ మెడల్‌తో మోహనకృష్ణ

రాజానగరం: విశాఖపట్నంలో నిర్వహించిన ఇండియన్ నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 2022–23లో రైట్ కళాశాల విద్యార్థి ఎం.మోహనకృష్ణ తృతీయ స్థానంలో నిలిచాడు. అండర్ 66 కేజీల విభాగం 85 కేజీల బరువును ఎత్తి, బ్రాంజ్ మెడల్ సాధించాడు. జనవరి 4 నుంచి 10 వరకూ జరిగిన ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కాగా.. మోహనకృష్ణను కళాశాల సెక్రటరీ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.మురళీకృష్ణ అభినందించారు.

గోదావరి బయో మెడికల్ వేస్ట్ పరిశ్రమ లేనట్టే

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, హౌసింగ్ చైర్మన్ దొరబాబు

రంగంపేట: ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా మర్రిపూడిలో నిర్మించ తలపెట్టిన గోదావరి బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమ ఇక లేనట్టేనని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మర్రిపూడిలో పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా 5 గ్రామాల ప్రజలు చేస్తున్న రిలే నిరాహార దీక్ష కార్యక్రమాన్ని గురువారం ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుతో కలిసి విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయో పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న శాంతియుత రిలే నిరసనలు 180 రోజులకు చేరిందన్నారు. ఎప్పుడైతే పొల్యూషన్ ఎక్స్‌టెన్షన్ వారికి ఇవ్వలేదో ఫ్యాక్టరీ కట్టడానికి అనుమతి లేనట్టేనని చెప్పారు. అనంతరం రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు వేము మాధవి, కంచుమర్తి శ్రీను, రాంబాబు, ఎన్.నాగేంద్ర, ఉప సర్పంచ్ మేడిది చక్రం, పలివెల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతగా కొత్త తుంగపాడు



సీతానగరంలో క్రీడాకారులతో నాయకులు

సీతానగరం: జక్కంపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న జక్కంపూడి మెగా స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో భాగంగా సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో జరిగిన కబడ్డీ పోటీల్లో కొత్త తుంగపాడు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో దివాన్ చెరువుపై ఆ జట్టు విజయం సాధించింది. రన్నర్‌గా దివాన్ చెరువు, 3వ స్థానంలో భూపాలపట్నం, 4లో శ్రీరంగపట్నం, 5లో కాటవరం, 6లో చిన కొండేపూడి నిలిచాయి. రిఫరీలుగా వ్యవహరించిన ఏడీవీ ప్రసాదరావు, వి.శ్రీనివాస్, ఎస్.వీరబాబు, ఏడీ ప్రసాద్, డి.శ్రీనుబాబు, వై.వెంకటేశ్వర్లు, బి.సూరిబాబు, కె.రెడ్డియ్య, ఎస్.అప్పన్న, వి.అశోక్ కుమార్, ఆర్.నాగేశ్వరరావు, సీహెచ్ రాజశేఖర్, ఎస్.నాగరాజును, క్రీడాకారులను ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, ఎంపీటీసీ తాడిపల్లి వెంకట్రావు, నాయకుడు పిచ్చుకల విజయ్ కుమార్ అభినందించారు.

వాలీబాల్ విజేత గాడాల

మధురపూడి: కోరుకొండ మండలం గాడాలలో జరిగిన వాలీబాల్ పోటీల్లో గాడాల జట్టు విజేతగా నిలిచింది. నరేంద్రపురంపై ఆ జట్టు విజయం సాధించింది. 3వ స్థానంలో రాజానగరం, 4లో బొబ్బిల్లంక, 5లో గుమ్ములూరు. 6లో శ్రీరంగపట్నం నిలిచాయి.

గర్భిణులు, బాలింతలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

బిక్కవోలు: గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యుడు రాజీవ్ తెలిపారు. గురువారం బిక్కవోలు పీహెచ్‌సీ వద్ద అనీమియా ముక్త్ భారత్‌లో రక్తహీనతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనపర్తి సీహెచ్‌సీ గైనకాలజిస్టులు లక్ష్మి, నెస్సీలు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలే కాకుండా 14 నుంచి 19 ఏళ్ల వయసున్న బాలికల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటుందన్నారు. వారికి పౌష్టికాహారం అందజేసి రక్తహీనత సమస్యను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలతో జీవన వికాసం

రాజానగరం: సంస్కృతి, సంప్రదాయాలను ఆచరించడంతో జీవన వికాసం కలుగుతుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఓఎస్‌డీ ఆచార్య ఎస్.టేకి అన్నారు. సంపత్ నగరంలోని రాజమహేంద్రి కళాశాలలో గురువారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు ఆర్‌జేడీ ఐ.శారద, కళాశాల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ టి.సత్యసౌందర్య, ఎన్ఎస్ఎస్ పీఓ లక్ష్మీప్రవీణ, ప్రసాద్ పాల్గొన్నారు.

- రాజానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్యాధికారి డాక్టర్ టి.రవికుమార్ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీ నిర్వహించారు. మండలంలోని 22 గ్రామ సచివాలయాలకు చెందిన మహిళ ఉద్యోగులు ముగ్గులు వేశారు. మొదటి బహుమతిని ఫరిజల్లిపేట, రెండో బహుమతిని ముక్కినాడ, మూడో బహుమతిని తూర్పుగానుగూడెం సచివాలయాల సిబ్బంది అందుకోగా, నాలుగో బహుమతిని రాజానగరం పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు దక్కించుకున్నారు. ఎంపీపీ మండారపు సీతారత్నం, వైస్ఎంపీపీ కొల్లిసత్య విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, సర్పంచ్ కె. ప్రసాద్, పీహెచ్‌సీ డీసీ చైర్మన్ ప్రగడ చక్రి పాల్గొన్నారు.



రాజానగరం పీహెచ్‌సీలో రంగవల్లుల పోటీ



సంపత్ నగరం కళాశాలలో భోగిమంట వెలిగిస్తున్న దృశ్యం



ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

- సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో చిన్నారులు గోదాదేవి, హరిదాసు, పిట్టలదొర, కొమ్మదాసరి, కోయదొర, సోదెమ్మ, పురోహితుడు తదితర వేషధారణలో అలరించారు.

విద్యా సంస్థల్లో సంక్రాంతి సందడి

మధురపూడి: కోరుకొండ మండలంలోని పలు విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సృజన విద్యాసంస్థలో షణ్ముక్ ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు, గాలిపటాల ఎగురవేసే పోటీలు నిర్వహించారు. శీలధి స్కూల్లో డైరెక్టర్ జి.లక్ష్మీ పద్మావతి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో..

గోకవరం: కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సాంప్రదాయ వస్త్రాలు, హరిదాసు వేషధారణల్లో అలరించారు. చిన్నారులకు తల్లిదండ్రులు భోగిపండ్లు వేసి పలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిరారాణి, అంగన్‌వాడీ కార్యకర్త కొండారత్నం, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కోరుకొండ సృజన స్కూల్లో భోగిమంట



శీలధి స్కూల్లో రంగవల్లులు



కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలు

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



గోకవరంలో కబడ్డీ టోర్నమెంట్‌లో తలపడుతున్న క్రీడాకారులు

గోకవరం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని గోకవరం శివారున గంగాలమ్మ ఆలయం వద్ద నిర్వహిస్తున్న దాసరి వెంకటేశ్వరరావు(బాబు) మెమోరియల్ కబడ్డీ టోర్నమెంట్‌లో జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. ఈ టోర్నమెంట్‌ను గ్రామ పెద్దలు దాసరి తమ్మన్నదొర, దాసరి రమేష్, సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్ ప్రారంభించారు. మూడు రోజుల పాటు ఈ టోర్నమెంట్ జరుగుతుందని, శుక్రవారం ఫైనల్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.